JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । మంగళవారం 14-10-2025
Medchal - Malkajgiri । Tuesday 14-10-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 138 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 138 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com




అశేష భక్తుల కొంగుబంగారం వన దేవతలైన శ్రీ సమ్మక్క సారలమ్మ మేడారం జాతర శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులకు ప్రభుత్వం 251 కోట్ల రూపాయిలు ఖర్చు చేస్తుంది.

# రూ.251 కోట్లతో మేడారం జాతర అభివృద్ధి పనులు

జయభేరి, హైదరాబాద్ :

సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సహచర మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఎంపీ బలరాం నాయక్, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులు, మేడారం ఆస్థాన పూజారులతో కలిసి ములుగు జిల్లా మేడారంలోని సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంగణం అభివృద్ధి పనులను పర్యవేక్షించి, పనుల ప్రగతిని సమీక్షించడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం పర్యటన సందర్భంగా 101 కోట్ల రూపాయిలు మంజూరు చేయగా వీటిలో 71 కోట్ల రూపాయిలకు టెండర్లు పిలవడం జరిగింది. గతంలో మంజూరైన 150 కోట్ల రూపాయిలతో కలిపి దశలవారీగా శాశ్వత ప్రాతిపదికన ఆలయాభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.

ప్రతి ఏడాది మేడారం జాతరకు వచ్చే నిధులు జంపన్న వాగులో వరదలాగ జారిపోకుండా గిరిజన, గిరిజనేతరుల ఆరాధ్యదైవాల ప్రాంగణాలను శాశ్వతంగా అభివృద్ధి చేస్తాం, దీనిలో భాగంగా రోడ్ల విస్తరణ, ఇతర నిర్మాణాలు చేపడుతున్నాం. మరో 50 రోజుల్లో ఈ పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా ఒక క్రమపద్ధతిలో సాగేలా కలెక్టర్, ఎస్పీలకు సూచనలు ఇవ్వడం జరిగింది. ఆలయాభివృద్ధికి ఎవరు ఎటువంటి సలహాలు సూచనలు ఇచ్చినా స్వీకరిస్తాం. ఈ పనులను స్థానిక మంత్రిగా సీతక్క స్వయంగా పర్యవేక్షిస్తారు. గతంలో ఈ జాతరకు కోటి మందికి పైగా వచ్చారు.. ఈ సారి ప్రభుత్వ చేపడుతున్న అభివృద్ధి, మౌళిక సదుపాయాల కల్పన వంటి చర్యల కారణంగా ఈ సంఖ్య రెట్టింపు అవుతుందనుకుంటున్నాము. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు అభివృద్ధి పనులు చేస్తున్నాం. సమ్మక్క సారలమ్మల వంటి సీతక్క, సురేఖ అక్కలతో మేడారం జాతర అభివృద్ధి కార్యక్రమాలకు హాజరవుతూనే ఉంటాను.

# రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలలో అత్యవసర పనులకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) నుంచి రూ. 60 కోట్లు కేటాయించింది. ఈ నిధులను హాస్టళ్లలో డైట్ ఛార్జీలు, తాత్కాలిక సిబ్బంది జీతాల విడుదల, హాస్టళ్లలో మోటార్ల మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు వినియోగించుకునే వెసులుబాటు కలిగించింది.

- వివిధ సంక్షేమ విభాగాల ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ సమీక్ష

జయభేరి, హైదరాబాద్:

హాస్టళ్లకు కేటాయించిన నిధుల చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయా శాఖల సీనియర్ అధికారులకు అందజేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ గృహాలు, విద్యా సంస్థలపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది ముఖ గుర్తింపుకు ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పూర్తి స్థాయి డేటా, జవాబుదారీతనం ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. "విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను తెలుసుకునేందుకు యాప్‌ను ఉపయోగించాలి. విద్యార్థులకు సరైన పోషకాలతో కూడిన నాణ్యమైన, పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలి. దాంతో వారికి లభించే కేలరీలను తెలుసుకోవాలి. హాస్టల్ విద్యార్థులకు అందించే యూనిఫాంలు, పుస్తకాలు సకాలంలో సక్రమంగా అందేలా సీనియర్ అధికారులు చూసుకోవాలి. హాస్టళ్లలో ఉన్న సౌకర్యాలు, ఇతర వసతులు, వాటి నిర్వహణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు డాష్‌బోర్డ్‌లో అప్‌లోడ్ చేయాలి. హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

...మిగతాది 2 లో

# నిజం, ధర్మం గెలుస్తాయి



జయభేరి, హైదరాబాద్ అక్టోబరు 13 :

జూబ్లీహిల్స్‌లో పోరు మొదలైందని, ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. నిజం, ధర్మం కూడా బీఆర్ఎస్ పక్షానే ఉన్నాయని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగిస్తూ, కాంగ్రెస్ పార్టీ గురించి, రేవంత్ రెడ్డి గురించి హైదరాబాద్ నగర ప్రజలకు బాగా తెలుసని, అందుకే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా దక్కలేదని అన్నారు. అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించిందని గుర్తుచేశారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రజలు సైతం ఇప్పుడు ఆగ్రహంతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కానీ, ఒక్క ముస్లిం ఎమ్మెల్సీ కానీ లేరని ఆయన విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అజారుద్దీన్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుండి పోటీ చేశారని, ఈసారి కూడా ఆయన టిక్కెట్ ఆశిస్తారని భావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయనను

...మిగతాది 2 లో



# సునీతమ్మ కంటతడి

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత తన భర్త మాగంటి గోపీనాథ్‌ను తలుచుకుని కంటతడి పెట్టారు. రహమత్‌నగర్‌లో జరిగిన నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో వేదికపై ఆమె ప్రసంగిస్తూ ఉద్వేగానికి లోనయ్యారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ప్రజలు తమ కుటుంబాన్ని సొంత కుటుంబంగా భావిస్తున్నారని ఆమె అన్నారు. ఆమె ప్రసంగిస్తుండగా అభిమానులు 'జై గోపీనాథ్' అంటూ నినాదాలు చేశారు." గోపన్న అంటేనే జనం.. జనం అంటేనే గోపన్న. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలను గోపీనాథ్ కుటుంబ సభ్యులుగా భావించేవారు. ఈరోజు ఆయన కోసం కుటుంబం తరలి వచ్చింది. ఆయన పైనుండి చూస్తూనే ఉంటారు. మనమందరం కలిసి గోపీనాథ్ ఆశయాలను ముందుకు తీసుకు వెళదాం. నన్ను మీ ఇంటి ఆడబిడ్డగా భావించండి. గోపీనాథ్ ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించేవారు" అని ఆమె పేర్కొన్నారు.

# గూగుల్ ఎఐ హబ్ కు డిల్లీలో అవగాహన ఒప్పందం



- చంద్రబాబు బ్రాండింగ్, లోకేష్ నిరంతర కృషితో అతిపెద్ద పెట్టుబడి
- గూగుల్ రాకతో ఎఐ సిటీగా రూపాంతరం చెందనున్న విశాఖపట్నం
- మంత్రి లోకేష్ అమెరికా పర్యటనలోనే సంస్థ ప్రతినిధులతో తొలిచర్చలు
- రాష్ట్రానికి భారీ ఆదాయంతోపాటు యువతకు 1.88లక్షల ఉద్యోగావకాశాలు

జయభేరి, అమరావతి:

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బ్రాండ్ ఇమేజ్, రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ నిరంతర కృషితో ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మారబోతున్నాయి. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును మలుపుతిప్పే అతిపెద్ద ప్రాజెక్టుకు రేపు న్యూఢిల్లీలో అవగాహన ఒప్పందం కుదరనుంది. ఇది ఎపి చరిత్రలో మైలురాయిగా నిలవబోతోంది. భారత ఎఐ శక్తిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నంలో దేశంలోనే తొలి కృత్రిమ మేధస్సు (AI) కేంద్రాన్ని "గూగుల్ ఏఐ హబ్" పేరుతో శ్రీకారం చుట్టనుంది. విశాఖలో పది బిలియన్ అమెరికన్ డాలర్ల (సుమారు రూ.87,250)తో గూగుల్ 1 గిగావాట్ హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుకు సంబంధించిన ఎంఓయుపై న్యూ ఢిల్లీలో సంతకాలు చేయనున్నారు.

...మిగతాది 2 లో

# మార్పులతో బీహార్ ఎలక్షన్స్

జయభేరి, పాట్నా, అక్టోబరు 13:

బీహార్ అసెంబ్లీకి నవంబర్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించేలా ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఈ ఎన్నికల్లో గతంలో ఎన్నడూ అమలు చేయని మూడు కీలక చర్యలను ఎన్నికల సంఘం ప్రవేశపెట్టింది. అధికార, విపక్ష పార్టీలకు అభ్యంతరం చెప్పే వీలు లేకుండా, ఈ మార్పులు ఓట్ల క్రమబద్ధమైన లెక్కింపు, ఫేక్ ఓటింగ్ నిరోధానికి దోహదం చేయనున్నాయి. ఈసీ చేపట్టిన మూడు మూడు మార్పుల్లో మొదటిది ఇది. ప్రతీ పోలింగ్ బూత్‌లో

...మిగతాది 2 లో



# నా వ్యాఖ్యలు వక్రీకరించారు

జయభేరి, బెంగాల్, అక్టోబరు 13:

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన దుర్గాపూర్ సామూహిక అత్యాచార కేసుపై తన వ్యాఖ్యలను మీడియా తప్పుగా ఉద్దేశపూర్వకంగా వక్రీకరించి ప్రచారం చేసిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు.

...మిగతాది 2 లో



▶▶ మొదటిపేజీ తరువాయి

## సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ప్రతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులను హాస్టళ్లతో అనుసంధానించాలి. హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలి. అత్యవసర సమయాల్లో వైద్యులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలి. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తరచుగా హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చూడాలి..” అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లకు స్కాలర్‌షిప్‌లు, సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, నిర్మాణ ఖర్చులు, ఇతర ఖర్చులు, బకాయిల చెల్లింపు, హాస్టళ్ల నిర్వహణకు అయ్యే నెలవారీ ఖర్చులు, బకాయిల చెల్లింపుకు అవసరమైన మొత్తానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి CS రామకృష్ణారావు, సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌లను ఆదేశించారు. హాస్టళ్ల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి నిధులను సమీకరించాలని, వాటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. 24 గంటలూ ఆన్‌లైన్‌లో వైద్యులు అందుబాటులో ఉండేలా హాట్‌లైన్ ఏర్పాటు చేయాలని, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఎడ్‌టెక్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే సేవలను సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలని, ఉద్దేశపూర్వకంగా చేసే తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. వీటన్నింటికీ అవసరమైన యాప్‌లను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమీక్షకు ముందు సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ హాస్టళ్లలోని పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు.

## గూగుల్ ఎఐ హబ్ కు డిల్లీలో అవగాహన ఒప్పందం

ఇది భారతదేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్ డిఐ)గా రికార్డు సృష్టించబోతోంది. న్యూఢిల్లీలోని మాన్ సింగ్ హోటల్ లో మంగళవారం ఉదయం 10గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్వనీ వైష్ణవ్, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఏపి ప్రభుత్వ ప్రతినిధులు, గూగుల్ ఉన్నతస్థాయి బృందం ఎంఓయుపై సంతకాలు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ ను ఎఐ ఆధారిత ఆవిష్కరణలు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ లో దేశంలోనే అగ్రగామిగా నిలపడమే ఒప్పందం ప్రధాన లక్ష్యం. రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అమెరికా పర్యటన సందర్భంగా గత ఏడాది అక్టోబర్ 31వతేదీన శాన్ ఫ్రాన్సిస్కోలో గూగుల్ క్లౌడ్ సిఇఓ థామస్ కురియన్ తో జరిపిన చర్చల్లో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. ఆ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఎఐ ఎకోసిస్టమ్ ఏర్పాటు చేయడంపై చర్చించారు. ఆ తరువాత గూగుల్ ప్రతినిధులతో పలుదఫాలుగా జరిగిన చర్చలు కార్యరూపం దాల్చాయి. గూగుల్ ఏఐ హబ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గూగుల్ సంస్థ పూర్తి AI సాంకేతిక వేదికను ఆతిథ్యం ఇవ్వగల అవకాశం లభిస్తుంది. దీని ద్వారా భారతదేశంలో కృత్రిమ మేధస్సు ఆధారిత అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ కీలక నాయకత్వం వహించబోతోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా గూగుల్ సంస్థ రాబోయే అయిదేళ్లలో (2026-2030 మధ్య) సుమారు 10 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. ఇది ఆసియాలోనే గూగుల్ చేపట్టే అతి పెద్ద ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తుంది. ఈ పెట్టుబడి ద్వారా వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్థాయి. రాష్ట్రంలోని యువత కోసం విస్తృత స్థాయి ఏఐ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తారు. అలాగే, ఈ ఏఐ హబ్ ద్వారా విశాఖపట్నానికి మరిన్ని గ్లోబల్ పెట్టుబడులను ఆకర్షించే అవకాశముంది. తద్వారా టెక్నాలజీ, ఇన్నొవేషన్ రంగాల్లో విశాఖ ప్రధాన కేంద్రంగా మారుతుంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనతోపాటు వ్యాపార అనుకూల విధానాలను అమలు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను జాతీయ స్థాయి ఎఐ ఎక్సలెన్స్ సెంటర్ గా అభివృద్ధి చేయడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం. గూగుల్ చేపట్టే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ద్వారా విశాఖపట్నాన్ని ఏఐ సిటీగా మార్చబోతోంది. విశాఖలో ఏర్పాటుచేసే డేటా సెంటర్ ద్వారా గూగుల్ తన పూర్తి కృత్రిమ మేధ (AI) వ్యవస్థను అమలు చేసి, భారతదేశంలో AI ఆధారిత ట్రాన్స్‌ఫర్మేషన్ ను వేగవంతం చేయనుంది. ఈ కొత్త AI హబ్ లో అత్యాధునిక AI మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్ సామర్థ్యం, భారీ స్థాయి ఇంధన వనరులు, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌లను ఒకేచోట సమన్వయపరచి, విశాఖపట్నాన్ని భారతదేశ AI ట్రాన్స్‌ఫర్మేషన్ కేంద్రంగా నిలబెడుతుంది. గూగుల్ గ్లోబల్ నెట్‌వర్క్‌తో సముద్ర గర్భ, భూభాగపు కేబుల్ కనెక్టివిటీ ద్వారా అనుసంధానించి, క్లీన్ ఎనర్జీతో పనిచేసే విధంగా ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అంచనా ప్రకారం, ఈ ప్రాజెక్ట్ 2028-2032 కాలంలో సగటున సంవత్సరానికి రూ.10,518 కోట్ల జీఎస్‌డీపీ వాటాతోపాటు సుమారు 1,88,220 ఉద్యోగాలను సృష్టిస్తుంది. గూగుల్ క్లౌడ్ ఆధారిత ఉత్పత్తుల ద్వారా సంవత్సరానికి రూ.9,553 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుంది. మొత్తం ఐదేళ్ళలో సుమారు రూ.47,720 కోట్ల ఆర్థిక లక్ష్యాన్ని చేరుకోనుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (SIPB) ఆమోదం పొందింది. ప్రాజెక్టును వేగవంతంగా ప్రారంభించడానికి వీలుగా సింగిల్ విండో క్లియరెన్స్, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, రెన్యువబుల్ ఎనర్జీ, ప్లగ్అండ్‌ప్లే మౌలిక వసతులను ఏపి ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు, ఐటి అండ్ ఎలక్ట్రానిక్స్ శాఖలు సమన్వయంతో అందించేవిధంగా ఏర్పాట్లు చేశారు.

## నా వ్యాఖ్యలు వక్రీకరించారు

ఉత్తర బెంగాల్‌లోని వరదలు ప్రభావిత ప్రాంతాలను సందర్శించించేందుకు అలీపుర్దువార్ పర్యటనకు వెళ్లిన ఆమె సాముహిక అత్యచారాం కేసుపై తన వ్యాఖ్యలపై స్పందించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మీడియా తన మాటలను వక్రీకరించిందని. మీరు నన్ను ఏదో ఒక ప్రశ్న అడుగుతారు, నేను దానికి సమాధానం చెప్తాను..తర్వాత నా వ్యాఖ్యలను మీరు వక్రీకరిస్తారు అని..తన వ్యాఖ్యలను ఈ రకమైన రాజకీయాలకు వాడుకోవద్దని అన్నారు. దుర్గాపూర్‌లోని ప్రైవేట్ మెడికల్ కాలేజీ ఎంబీబీఎస్ విద్యార్థిని సామూహిక అత్యచారం ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. దీంతోపశ్చిమ్ బెంగాల్‌లో మహిళ భద్రతపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ ఘటనపై రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ స్పందిస్తూ మొదటగా ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన ఆమె తర్వాత కొన్ని కీలక వ్యాఖ్యలు చేసింది. అమ్మాయిల విషయంలో ప్రైవేటు విద్యా సంస్థలు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. అర్ధరాత్రి సమయంలో బాధిత అమ్మాయి బయటకు వెళ్లడంపై ఆమె ప్రశ్నించారు. ప్రవేటు కాలేజీలో చదువుతున్న ఆ విద్యార్థిని అర్ధరాత్రి 12.30కి బయటకు ఎలా వచ్చింది?అని ప్రశ్నించింది .ఈ ఘటనపై ఆమె చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపాయి. దీంతో మమతా బెనర్జీ తన వ్యాఖ్యలపై స్పందిస్తూ మీడియా తన వ్యాఖ్యలను తప్పుగా వక్రీకరించి ప్రచారం చేసిందని చెప్పుకొచ్చింది. ఇలా తప్పుడు వార్తలను ప్రచారం చేసే వారిపై పోలీసులు చర్యలు తీసుకుంటారని తెలిపింది.

## నిజం, ధర్మం గెలుస్తాయి

తప్పించేందుకు కేవలం కాగితంపై 'ఎమ్మెల్సీ' అని రాసి మోసం చేశారని విమర్శించారు. అజారుద్దీన్‌కు ఇచ్చే ఎమ్మెల్సీ నిలబడదని రేవంత్ రెడ్డికి తెలుసని అన్నారు. ఈ విషయం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని ఆయన తెలిపారు. కబరస్థాన్‌కు ఇచ్చిన స్థలం కూడా ఆర్మీకి చెందినదని, అది కూడా కోర్టులో నిలబడదని ఆయన అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అని చెప్పారని, అది కూడా కోర్టులో నిలబడలేదని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డికి అన్నీ తెలిసినా ప్రజలను మోసం చేయడానికి ఇలాంటి పనులు చేస్తున్నారని ఆయన విమర్శించారు. బీసీలను, మైనార్టీలను ముఖ్యమంత్రి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు గట్టిగా బుద్ధి చెబితే, ఢిల్లీలోని అధిష్ఠానం సైతం ఉలిక్కిపడుతుందని వ్యాఖ్యానించారు. ప్రజలు మోసపోయి ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం నెలకొందని అన్నారు. దుర్గాదేవిలాగా, కాళికాదేవిలాగా కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని ఇప్పుడు ప్రతి మహిళ అంటోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్లు నమోదు చేయించిందని ఆయన ఆరోపించారు. ఒక ఇంట్లో అయితే ఏకంగా 43 దొంగ ఓట్లు నమోదు చేయించారని అన్నారు. కాంగ్రెస్ ఒక్కో వర్గానికి చాలా బాకీ పడిందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ బాకీ కార్డును ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. పెన్షన్ పెంపు, మహిళలకు నెలకు రూ. 2,500, నిరుద్యోగ భృతి ఇలా అన్నీ కాంగ్రెస్ బాకీలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.

# పాకిస్తాన్ కు చుక్కలు చూపిస్తున్న ఆఫ్ఘన్

**మొన్నటివరకు రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం.. ఆ తర్వాత గాజా, పాలస్తీనా మధ్య వార్.. ఆ తర్వాత భారత్, పాకిస్తాన్ మధ్య వివాదం.. ఇలా దేశాల మధ్య యుద్ధం జరుగుతున్న సమయంలో పక్కపక్కకే ఉన్న పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య కూడా యుద్ధ వాతావరణం నెలకొన్నట్లు తెలుస్తోంది.**





అక్టోబర్ 9న ఆఫ్ఘానిస్థాన్ ను లక్ష్యంగా చేసుకొని కాబుల్ పై వైమానిక దాడులు చేసింది. ఈ దాడిలో సాధారణ పౌరులు మరణించారు. దీంతో ఈ విషయాన్ని సీరియస్గా తీసుకున్న తాలిబాన్లు ప్రతీకారంగా పాకిస్తాన్పై దాడులు ప్రారంభించారు. తాజాగా నిర్వహించిన దాడుల్లో పాకిస్తాన్ కి చెందిన నలుగురు సైనికులు చనిపోయినట్లు ప్రకటించారు. అయితే పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ రెండు ముస్లిం దేశాలే. కానీ అనుకోకుండా ఆఫ్ఘనిస్తాన్ పై పాకిస్తాన్ దాడి చేయాల్సిన అవసరం ఏమి వచ్చింది? ఈ యుద్ధం తీవ్రస్థాయికి చేరనుందా?అమెరికా అండ చూసుకొని పాకిస్తాన్ రెచ్చిపోతుంది. ఆఫ్ఘనిస్తాన్ దేశం మీద అడ్డగోలుగా దాడులు చేస్తోంది. ఎప్పుడైతే అమెరికా ఫోల్డ్ లోకి పాకిస్తాన్ వెళ్ళిందో.. అప్పుడే ఆఫ్ఘనిస్తాన్ అత్యంత తెలివిగా భారత్ కు దగ్గరయింది. ఖనిజాల తవ్వకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఒక్కసారిగా పరిస్థితులు మారిపోయాయి.

ఇవన్నీ కూడా అంతర్జాతీయంగా పెను ప్రభావాన్ని చూపుతున్నాయి. అంతేకాదు అమెరికా అండ చూసుకొని రెచ్చిపోతున్న పాకిస్తాన్ కు ఆఫ్ఘనిస్తాన్ ఇప్పుడు చుక్కలు చూపిస్తోంది.ఇటీవల ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ పాకిస్తాన్ మీద దాడులు చేసిన విషయం తెలిసిందే. పాకిస్తాన్ భూభాగంలో ఉన్న ఉగ్రవాద స్థావరాలను భారత దళాలు నేల కూల్చాయి. అనేకమంది ఉగ్రవాదులను హతం చేశాయి. దీని నుంచి స్ఫూర్తి పొందిన ఆఫ్ఘనిస్తాన్ పాకిస్తాన్ దేశానికి నరకం అంటే ఏమిటో రుచి చూపిస్తోంది. కొద్దిరోజులుగా ఆఫ్గనిస్తాన్ దేశంపై పాకిస్తాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. వీటిని మొదట్లో అంతగా పట్టించుకోని ఆఫ్ఘనిస్తాన్.. ఆ తర్వాత కౌంటర్ ఎటాక్ మొదలు పెట్టింది. ఇందులో భాగంగానే ఆఫ్ఘనిస్తాన్ పాకిస్తాన్ దేశంపై దాడులకు దిగింది. ఏకంగా 58 మంది పాకిస్తాన్ సైనికులను హతం చేసింది.

ఈ విషయాన్ని తాలిబన్ ప్రతినిధి ముజాయిద్ వెల్లడించారు.ఆఫ్ఘనిస్తాన్ దేశంపై కొంతకాలంగా పాకిస్తాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. ముఖ్యంగా సరిహద్దు, గగనతల ఉల్లంఘనలకు పాల్పడుతోంది. ఈ నేపథ్యంలో ఆ దేశానికి ఆఫ్ఘనిస్తాన్ గట్టిగా బదులిచ్చింది. ఏకంగా 25 పాకిస్తాన్ ఆర్మీ పోస్టులను ధ్వంసం చేసింది. అంతేకాదు ఐ సిస్ ఉగ్రవాదులకు స్థావరం గనుక ఇస్తే పాకిస్తాన్ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.. అమెరికా అండ చూసుకొని పాకిస్తాన్ రెచ్చిపోతోందని.. అలాంటి ఆటలు తమ ముందు సాగవని ఆఫ్గానిస్థాన్ హెచ్చరిస్తోంది. ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే తాము అంతకంటే గట్టిగా బదులిస్తామని స్పష్టం చేసింది.పాకిస్తాన్లో విలువైన వనరులు ఉన్న నేపథ్యంలో ఇటీవల కాలంలో అమెరికాకు దగ్గర కావడం మొదలుపెట్టింది. అమెరికా కూడా పాకిస్తాన్ అవకాశాన్ని ఆసరాగా తీసుకొని వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకుంది.

ఓ నివేదిక ప్రకారం ఈ వ్యాపార విలువ 500 మిలియన్ డాలర్ల వరకు ఉంటుందని తెలుస్తోంది. అయితే దీనిపై ఇంతవరకు అధికారికంగా ప్రకటన రాలేదు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల మధ్య సరియైన సరిహద్దురేఖ లేదు. అయితే రెండు దేశాల మధ్య 2,600 కిలోమీటర్ల సరిహద్దు ఉంది.. ఆఫ్ఘనిస్తాన్ కు చెందిన అనే గ్రూప్ పాకిస్తాన్లోకి అక్రమంగా చొరబడి తమ పౌరులను చంపుతున్నారని వాదన చేస్తోంది. ఇది ఉగ్రవాద సంస్థ అని పాకిస్తాన్ భావిస్తుంది. అయితే ఈ గ్రూపును మట్టు పెట్టడానికి ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి పాకిస్తాన్ వైమానిక దాడులు చేసినట్లు తెలుస్తోంది. కానీ ఆఫ్ఘానిస్థాన్ మాత్రం తమ దేశంపై అకారణంగా కాల్పులు జరిపినట్లు భావించి ప్రతీకారం తీసుకోవడానికి సిద్ధమైనట్లు అధికారికంగానే ప్రకటించింది.ఆఫ్ఘనిస్తాన్ దేశంలో ప్రస్తుతం తాలిబన్ల ప్రభుత్వం కొనసాగుతోంది. గతంలో ఆఫ్ఘనిస్తాన్ దేశంలో అమెరికా తన మిలటరీని 20 ఏళ్లుగా ఇక్కడ కొనసాగించింది. ప్రపంచంలో ఎంతో శక్తివంతమైన అమెరికా మిలిటరీని వెనక్కి పంపిన ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వం ప్రస్తుతం పాకిస్తాన్ పై యుద్ధం ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఇది దేశాల్లోనూ ఆర్థిక పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ఇరుదేశాల్లోని ప్రజలు ఆహారం దొరకక అలమటిస్తున్నారు. ఇలాంటి సమయంలో రెండు దేశాల మధ్య యుద్ధం కొనసాగుతుందా? లేదా? అనేది చర్చనీయాంశంగా మారింది.మరోవైపు పాకిస్తాన్ దేశంలో కొన్ని ప్రదేశాల్లో చైనా కొన్ని ప్రాజెక్టులను చేపట్టినట్లు సమాచారం. అయితే TTP గ్రూప్ ఈ ప్రాజెక్టులపై దాడులు చేస్తున్నట్లు పాకిస్తాన్ గుర్తించింది.

అయితే ఈ గ్రూపుకు ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వం సపోర్ట్ గా ఉందని భావించి ఆ దేశం పై దాడులకు దిగుతుందని మరోవాదనే ఉంది. అంటే చైనా ప్రభుత్వం పాకిస్తాన్లో చేపట్టే కొన్ని ప్రాజెక్టులకు ఎదురు దెబ్బలు రావడంతో వాటి నుంచి తట్టుకోవడానికి పాకిస్తాన్పై ఒత్తిడి తేగా.. పాకిస్తాన్ ఏకంగా ఆఫ్ఘనిస్తాన్ దేశంపై యుద్ధం ప్రకటించినట్లు తెలుస్తోంది.

అయితే ఈ రెండు దేశాల కు ఏ దేశం మద్దతు ఇస్తుందో? తెలియని పరిస్థితి. ఎందుకంటే చైనాకు పాకిస్తాన్ దేశం దగ్గరగా ఉంటుంది. కానీ ఇప్పటికిప్పుడు అఫ్గానిస్తాన్ దేశంతో యుద్ధం ప్రకటించలేదు. ఎందుకంటే అమెరికా లాంటి దేశాలే తాలిబాన్లతో వేగలేక కామ్ గా కూర్చున్నాయి. మరి ఈ పరిస్థితి ఎలా సద్దుమరుగుతోందో చూడాలి.మరోవైపు పాకిస్తాన్ అమెరికాతో దగ్గర కావడాన్ని ఆఫ్ఘనిస్తాన్ అత్యంత లోతుగా పరిశీలించి.. భారతదేశానికి దగ్గర అయింది. త్వరలోనే తమ దేశంలో ఉన్న ఖనిజాలను తవ్వి తీసే బాధ్యతను భారతదేశంలో కంపెనీలకు అప్పగించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇది ఇలా సాగుతుండగానే రెండు దేశాల మధ్య భీకరమైన పోరాటాలు జరుగుతుండడం విశేషం. అయితే పాకిస్తాన్ దేశానికి గట్టి బదులు ఇస్తున్న నేపథ్యంలో ఆఫ్గనిస్తాన్ ప్రపంచ దేశాలను ఆకర్షిస్తోంది.

## మార్పులతో బీహార్ ఎలక్షన్స్

ఓటింగ్ ప్రారంభం నుంచి అంటే ఈవీఎంల స్టిక్కర్లు తొలగించి పోలింగ్ తర్వాత మళ్లీ ఈవీఎంలకు సీల్ వేసే వరకూ వెబ్‌కాస్టింగ్ జరుగుతుంది. నేరుగా ఈ ప్రసారం మానిటరింగ్ బృందాలకు చేరుతుంది. పోలింగ్ అనంతరం కూడా మానిటరింగ్‌పై సమగ్రంగా సంతకాలతో ధృవీకరణ ఉంటుంది. దీంతో రిగ్గింగ్, ఓట్ల దొంగతనం వంటి తప్పిదాలు తక్షణమే గుర్తించడం, నిరోధించడం సాధ్యం.ఇక రెండో కీలక మార్పు ఇదీ.. ఇప్పటి వరకు ఈవీఎం ఓట్లు సరిచూసిన తర్వాత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరిగేది. ఇకపై ముందుగా పోస్టల్ ఓట్ల లెక్కింపు పూర్తయి చివర్లో ఈవీఎం ఓట్ల చివరి రౌండ్ కౌంటింగ్ జరుగుతుంది. పోస్టల్ ఓట్లలో అవకతవకలకు అవకాశమే లేకుండా, ఫలితాలపై ప్రభావం జరగకుండా ఉంటుంది.మూడోది అత్యంత కీలకమైనది ఇది. బుర్కా ధరించి వచ్చే మహిళా ఓటర్ల గుర్తింపుపై ప్రతిసారి వివాదం జరుగుతోంది. మిగతా సందర్భాల్లో బుర్కా తొలగించేందుకు అభ్యంతరం చెప్పని ముస్లిం మహిళలు.. పోలింగ్ కేంద్రాల్లో మాత్రం అభ్యంతరం చెబుతున్నారు. దీంతో ఈసారి అలాంట సమస్య ఉండకుండా ముస్లిం మహిళా ఓటర్ల బుర్కా తొలగించి ఓటర్ ఐడీ లేదా ఇతర గుర్తింపు కార్డుతో ముఖాన్ని పోల్చేందుకు అంగన్‌వాడీ మహిళలను నియమించారు. గుర్తింపు కార్డుతో ప్రత్యక్ష ముఖచిత్రం సరిపోలిన తర్వాతే ఓటు వేయాలని కొత్త విధానం. దీంతో ఫేక్ ఓటింగ్, ఐడెంటిటీ మోసాలను అరికట్టే అవకాశం ఉంది. ఇది బిహార్‌లో విజయవంతమైతే దేశవ్యాప్తంగా అమలు చేయవచ్చు.ఓటరు గుర్తింపు జాబితాలో అభ్యర్థుల ఫొటోలు బ్లాక్-అండ్-వైట్ స్థానంలో కలర్ రూపంలో ఉండనున్నాయి. దీనివల్ల గుర్తుపట్టడం సులభం.ఈ విధానాలు విజయవంతమైతే, బీహార్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా ఓటర్ల నిజమైన హక్కులను రక్షించే కొత్త ఎన్నికల ప్రమాణంగా నిలుస్తాయి. ముఖ్యంగా నిరంతర వెబ్‌కాస్టింగ్, పోస్టల్ ఓట్ల క్రమబద్ధత, బుర్కా ధ్రువీకరణ ఇవి ఓటు ప్రక్రియలో పరివర్తనాత్మక మార్పులు.

## పాండవులగుట్టను సందర్శించిన హెరిటేజ్ వాలంటర్లు




✍ జయభేరి, జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 13:

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, రేగొండ మండలంలోని పాండవుల గుహలను సందర్శించిన వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్ క్యాంప్ 20 25 వచ్చిన విద్యార్థిని విద్యార్థులు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ రామప్ప దేవాలయం దగ్గర పది రోజులు హెరిటేజ్ వాలంటీర్ క్యాంప్ 2025ను కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రొఫెసర్ పాండురంగారావు, శ్రీధర్ రావు నిర్వహిస్తున్నారు. పర్యాటకశాఖ తెలంగాణ ప్రభుత్వం సహకారంతో నిర్వహిస్తున్న ఈ క్యాంపులో శిక్షణలో భాగంగా 5వ రోజు పాండవుల గుహలను సందర్శించారు. వీరికి ఉమ్మడి వరంగల్ జిల్లా అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్య కిరణ్ పాండవుల గుహల చరిత్రను వాటి ప్రాముఖ్యతను వివరించారు. క్యాంప్ కోఆర్డినేటర్ గా శ్రీధర్ రావు వ్యవహరిస్తున్నారు. పాండవుల గుహలను స్థానికుడు రావుల తిరుపతితో పాండవుల గుహలలోని అన్ని ప్రదేశాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పాండురంగారావు, శ్రీధర్ రావు, శ్రీనివాస్, డాక్టర్ కృష్ణ సూర్య కిరణ్, అటవీ శాఖ సిబ్బంది శ్రీకరావుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్యను పరిష్కరించాలి

- భగీరథ నీటి సరఫరా వెంటనే పునరుద్ధరించాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రం.. శైలజ హరినాథ్

జయభేరి, మేడ్చల్ :



మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో త్రాగునీటి సమస్యలు తీవ్రమవుతున్న నేపథ్యంలో భగీరథ పథకం ద్వారా నీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించాలంటూ బీజేపీ నాయకులు జిల్లా కలెక్టర్ మను చౌదరికి వినతిపత్రం సమర్పించారు. సోమవారం మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షురాలు జెల్లీ శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకుల బృందం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ను కలిశారు. ఈ సందర్భంగా నాయకులు మున్సిపాలిటీ పరిధిలోని అనేక కాలనీలు, బస్తీలకు త్రాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ కి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో భగీరథ పథకం ద్వారా మేడ్చల్ మున్సిపాలిటీకి ప్రతి రెండు రోజులకు ఒకసారి త్రాగునీటి సరఫరా జరిగేదని, అయితే ఇటీవల కాలంలో ఆ సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మూడు నుండి నాలుగు వారాలుగా నీటి బొట్టూ అందలేదని, ప్రజలు బోర్లు, ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తుందని చెప్పారు. ఈ పరిస్థితి కొనసాగితే వేసవి ప్రారంభానికి ముందే తీవ్రమైన నీటి సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భగీరథ నీటి సరఫరా పునరుద్ధరణకు తక్షణ చర్యలు తీసుకోవాలని, పంపింగ్ స్టేషన్లలోని సాంకేతిక లోపాలను సరిచేయాలని, లీకేజీ ఉన్న పైపులైన్‌లను మారుస్తూ అన్ని కాలనీలు, బస్తీలకు సమానంగా నీటి సరఫరా జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాక, తాత్కాలికంగా మున్సిపల్ ట్యాంకర్లను ప్రజల అవసరాల కోసం వినియోగంలో ఉంచాలని కూడా వారు సూచించారు. జిల్లా కలెక్టర్ బీజేపీ నాయకుల వినతిని శ్రద్ధగా విని, త్రాగునీటి సమస్యపై తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సంబంధిత శాఖ అధికారులను సంప్రదించి మేడ్చల్ మున్సిపాలిటీలో భగీరథ నీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు ప్రారంభిస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్ దాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాగం అర్జున్, రాష్ట్ర నాయకులు పాతూరి సుధాకర్ రెడ్డి, లవంగ శ్రీకాంత్, మున్సిపల్ కార్యదర్శి సురేందర్ రెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు అనిత, నాయకులు బొజ్జ వంశీధర్ రెడ్డి, నర్సింగ్ రావు, ఈశ్వర్ కూర్మ, గొప్ప నాగరాజు, గౌలికర్ మహేష్, వెంకటేష్, జాకట బాబురాజు, శ్రీపాల్ రెడ్డి, నవీన్ రెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు. జెల్లీ శైలజ హరినాథ్ మాట్లాడుతూ మేడ్చల్ ప్రజలు ప్రస్తుతం త్రాగునీటి కొరతతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, భగీరథ నీటి సరఫరా వెంటనే పునరుద్ధరించకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఆందోళనలు చేపడతామని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని, మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరా సవ్యంగా జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.




## వాన నన్ను అప్పుల పాలు చేస్తదా ఏంది..?

జయభేరి, గార్ల, అక్టోబర్ 13:

అప్పు తెచ్చి, పెట్టుబడి పెట్టి పత్తి, వరి, మొక్కజొన్న సాగు చేసిన రైతులకు తీరా పంట చేతికి ఒస్తదనుకుంటే మాయదారి వాన అప్పుల పాలు చేస్తదా ఏంది అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా కురవడం, నీరు పుష్కలంగా ఉండటంతో మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా రైతులు వరి సాగు అధికంగా చేశారు. వరి పంటలో సుడిదోమ వరి ఆకులను పసుపు రంగులోకి మార్చి ఎండిపోయేలా చేస్తుంది. తెగుళ్లతో వరి పంటకు నష్టం జరిగి, దిగుబడి తగ్గిపోయి, గింజలు తెల్లగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మోగి పురుగు, కాండం కుళ్ళు, అగ్గి తెగులు వంటి ఫంగస్ వ్యాధులు, తామర పురుగులు, వేరు పురుగులు పంటను ఆశిస్తున్నాయి. గింజ పోసుకునే దశలో వరి పంటలో తెగుళ్లు ఆశిస్తుండటంతో రైతులు దిగాలు పడుతున్నారు. చేతికొచ్చిన పత్తి, మొక్కజొన్న పంట భారీ వర్షాలకు తడిసిపోవడంతో చేసిన అప్పు ఎలా తీర్చాలో అని రైతులు కంట కన్నీరు తీస్తున్నారు. తీరా పంట చేతికి ఒస్తదనుకుంటే మాయదారి వాన ఆగం ఆగం చేస్తుందని వాపోతున్నారు. ప్రభుత్వం పంట నష్ట పరిహారం చెల్లించి, తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## చెరువులో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ సమస్యను పరిష్కరించి



జయభేరి, గార్ల, అక్టోబర్ 13 :

గార్ల మండలంలో గత రాత్రి పిడుగులతో కూడిన భారీ వర్షాలకు సిరిపురం, బాలాజీ తండా గ్రామాలకు సరఫరా అయ్యే విద్యుత్ లైన్ తెగిపోయింది. ఆ గ్రామాల్లో ప్రజలు చిమ్మ చీకట్లో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న విద్యుత్ ఏ ఈ సత్వరమే విద్యుత్ ను పునరుద్ధరించాలని ఆదేశించారు. నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పరిష్కరించడానికి సీతంపేట లైన్మెన్ సుధాకర్, యుగంధర్ లు గార్ల పెద్ద చెరువులో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ సరఫరా ను తిరిగి పునరుద్ధరించారు. వీరు చేసిన కృషికి ప్రజలు అభినందించారు.

## ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలను సద్వినియోగం చేసుకోవాలి




జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 13:

ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ పిండిగా జానయ్య అన్నారు. జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పశు వైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అన్ని పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుండి నవంబర్ 14 వరకు తుర్కపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో రెండు టీములుగా ఏర్పడి అన్ని గ్రామాల్లో గల పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్స్ శంషాద్దీన్, రాఘవేందర్, వీరు, పెండెం ప్రవీణ్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా మహాసభను విజయవంతం చేయాలి



జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 13:

కల్లు గీత కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా 4 వ మహాసభ ఈనెల 28 న చౌటుప్పల్లో నిర్వహిస్తున్నట్లు కల్లుగీత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మారగోని శ్రీరాంమూర్తి గౌడ్ అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్, మంచి రోణి మామిండ్లు గ్రామాల్లో కల్లు గీత కార్మికులతో కలిసి జిల్లా మహా సభ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మండల కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొక్కొండ లింగయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎరుకల వెంకటేష్ గౌడ్, నాయకులు, పల్లె కిష్టయ్య, తాటి కొండ బాల రాజు, తాటి కొండ లక్ష్మయ్య, బాలకృష్ణ, అశోక్, రాజు పాల్గొన్నారు.



## దాస్రు నాయక్ ఆరోగ్య చికిత్స కోసం ఆర్థికంగా సహాయం

జయభేరి, దేవరకొండ :

పాల్త్య దాస్రు నాయక్ ఆరోగ్యానికి సహాయంగా విరాళం అందించిన BRS పార్టీ నాయకులు నేనావత్ కిషన్ నాయక్ ప్రస్తుతం దాస్రు నాయక్ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ కష్ట సమయంలో వారికి అండగా నిలబడడం మన బాధ్యత. వారి చికిత్స కోసం నేనావత్ కిషన్ నాయక్ ఆర్థికంగా ₹30,000 (ముప్పై వేల రూపాయలు) సహాయం చేయడం జరిగింది. ఈసందర్భంగా నేనావత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ.. మానవత్వం మరచిపోకుండా, మన స్నేహితులు, కుటుంబ సభ్యులు కూడా చిన్న సహాయం చేసి వారిని ఆదుకోవాలని కోరుతున్నాను. ఒకరి ప్రాణాన్ని కాపాడటం కంటే గొప్ప దానం లేదు. ఈ కార్యక్రమంలో పాల్త్య రమేష్, పాల్త్యమణి, పాల్త్యసురేష్, పాల్త్యచందర్, పాల్త్యరాజేందర్ తదితరులు పాల్గొన్నారు. వారు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

## బోనస్ ఇప్పించాలని

- ప్రజావాణి లో రైతులు కలెక్టర్ కు ఫిర్యాదు

జయభేరి, జగిత్యాల, అక్టోబర్ 13:

జగిత్యాల జిల్లాలో వేసవి కాలం సీజన్ రైతులకు సన్న రకం ధాన్యం బోనస్ డబ్బులకు ఎదురుచూపులు తప్పడం లేదని, వేసవిలో విక్రయించిన సన్న వడ్లకు బోనస్ అందలేదని వెంటనే ఇప్పించాలని కోరుతూ రైతులు ప్రజావాణిలో కలెక్టర్ బి సత్యప్రసాద్ ను కోరారు. ..ధాన్యం విక్రయించి నెలలు గడుస్తున్నా సన్న రకం ధాన్యం బోనస్ డబ్బుల జాడే లేదని, ఒకవైపు వానాకాలం పంటల సాగు పెట్టుబడి పెరిగిందని, దీనికి తోడుగా ఎరువుల ధరలు కూడా పెరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు .ఈ పరిస్థితుల్లో పంటల సాగుకు ఉపయోగపడుతుందని సన్నరకం వైపు మొగ్గు చూపిన రైతులకు సకాలంలో బోనస్ డబ్బులు రాకపోవడంతో ఆవేదన మిగిలిస్తోందన్నారు. ఇప్పటికే వానకాలం సీజన్ నాట్లు వేసి కోత దశకు వచ్చిన.. యాసంగికి సంబంధించిన సన్న రకం ధాన్యం బోనస్ డబ్బులు మాత్రం రావడం లేదనీ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు పన్నాల తిరుపతి రెడ్డి, బందెల మల్లన్న, బుచ్చి రెడ్డి, కొట్టాల మోహన్ రెడ్డి, పడిగేల రాజన్న, పన్నాల తిరుపతి, కాటిపెల్లి సురేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాషన్కు కేరాఫ్ హైదరాబాద్

- టాలీవుడ్ సింగర్ సునీత




అధునాతన ఫ్యాషన్ హంగులను అనుసరించడం ఈతరం ట్రెండ్ గా మారిందని ప్రముఖ టాలీవుడ్ సింగర్ సునీత ఉపద్రష్ట అన్నారు. జూబ్లీహిల్స్ లోనీ అతిన రీగల్ వీవ్స్ స్టోర్ ఆధ్వర్యంలో కొత్త షోరూంను ప్రారంభించింది. ఈ స్టోర్ను గాయని సునీత ఉపద్రష్ట ఆవిష్కరించారు. హైదరాబాద్ నగరం అద్భుతమైన ఫ్యాషన్కు వేదికగా మారుతోందని, ఈ స్టోర్కు సిల్క్ మార్క్ సర్టిఫికెట్ రావటం గొప్ప విషయమని సునీత అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు స్వచ్ఛమైన పట్టు వస్త్రాలు అందించాలనే లక్ష్యంతో అతిన రీగల్ వీవ్స్ ప్రారంభించామని నిర్వాహకులు అనిత, లహరికా, మనశ్వని తెలిపారు.

# నిత్యసాయి సేవలు అభినందనీయం

- గుండ్లపోచంపల్లిలో ఏబీ హాస్పిటల్ ప్రారంభించిన ఎంపీ ధర్మపురి అరవింద్

జయభేరి, మేడ్చల్ :




సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయం అని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. సోమవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ లో నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ అద్వర్యం ఏర్పాటు చేసిన ఏబి హాస్పిటల్ ను ఎంపీ అరవింద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పేద ప్రజలకు వైద్యం అందని ద్రాక్షల మారిందన్నారు. డాక్టర్ రాఘవేంద్రరావు, డాక్టర్ హేమా లు మంచి ఉద్దేశంతో పేదలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించేందుకు ఈ హాస్పిటల్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ గత 23 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నారని ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ అరవింద్ సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, భాజపా ఎమ్మెల్యే ధన్ పల్ సూర్యనారాయణ గుప్త, డాక్టర్ సంజయ్, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ రమణ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన వైద్యం అందరి హక్కు - డా|| రాఘవేంద్రరావు



నాణ్యమైన వైద్యం అందరి హక్కు అని నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రాఘవేంద్ర రావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఏబీ హాస్పిటల్ ప్రారంభించడం జరిగిందన్నారు. నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గత 23 సంవత్సరాలుగా పేద మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలు అందిస్తుందన్నారు. తాము కూడా మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చిన వాళ్ళమే కాబట్టి సమాజానికి తమవంతు తోడ్పాటు అందించాలనే భావనతో నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 30 వేల మందికి శస్త్రచికిత్సలు, 3,500 నిరుపేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేయడం జరిగిందన్నారు. మంచి సదుద్దేశంతో కార్పొరేట్ హాస్పిటల్ కు దీటుగా వైద్యాన్ని నిరుపేదలకు అందించాలని గుండ్లపోచంపల్లిలో ఏబీ హాస్పిటల్ ను ఏర్పాటు చేశామని డాక్టర్ రాఘవేంద్రరావు తెలిపారు.

# కాలనీని మరింతగా అభివృద్ధి చేస్తాం

- అధ్యక్ష కార్యదర్శులు ఎం. నరేష్ గౌడ్, ఆర్. నాగిరెడ్డి
- హోరాహోరీగా సాగిన బిపిఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీ ప్రత్యక్ష ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో విజయం
- కాలనీ సభ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేసిన అధ్యక్ష, కార్యదర్శులు


జయభేరి, మేడిపల్లి :



ప్రజలందరి సహకారంతో శక్తివంచన లేకుండా కాలనీ ని అన్ని విధాలుగా మరింతగా అభివృద్ధి చేస్తామని, కాలనీ సభ్యుల ఐక్యతే ముఖ్యమని, నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మునుకుంట్ల నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రావు నాగిరెడ్డి, కోశాధికారి మునుకుంట్ల ప్రదీప్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పీర్జాదిగూడ నగర పరిధి లోని 5వ డివిజన్ బీపీఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీ లో అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో ప్రశాంత వాతావరణంలో కాలనీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో అధ్యక్షులుగా మునుకుంట్ల నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రావు నాగిరెడ్డి, కోశాధికారిగా మునుకుంట్ల ప్రదీప్ గౌడ్ తమ ప్రత్యర్థులపై అత్యధిక మెజారిటీ ఓట్లతో గెలుపొందారు. గెలుపొందిన కాలనీ కమిటీ సభ్యులను వివిధ పార్టీల నాయకులు కాలనీ ప్రజలు, మహిళలు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి పర్వతాపూర్ గ్రామ బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. శబరి గార్డెన్ వద్ద బాణాసంచా కాల్చుతూ ఆనందోత్సాహాలతో మిఠాయిలు పంచారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ... కాలనీలో ఐక్యత అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ ప్రతి ఒక్కరి సహకారంతో పెండింగ్లో ఉన్న అన్ని పనులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తామని తెలిపారు. కాలనీలో సీసీ కెమెరాలు, హైమాస్ట్ లైట్లు కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నామని అన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ఎల్లప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు. కాలనీలో ఎలాంటి వివక్షకు తావు లేకుండా కుల మతాల కతీతంగా ప్రతి ఒక్కరం కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షించారు. ఏది ఏమైనా కాలనీ ప్రజల సమిష్టి కృషి పట్టుదల క్రమశిక్షణతో ఎన్నికలు జరిగాయని కాలనీ అడహాక్ సభ్యులందరికీ, ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కమిటీ పదవీకాలం 3 సంవత్సరాలు ఉంటుందని కాలనీని మరింతగా అభివృద్ధి చేయాలని అడహాక్ కమిటీ సభ్యులైన ఎస్. సత్యనారాయణ, చేగూరి కుమార్, సిద్దేశ్వర్, ఎం. సదానందం లు పేర్కొన్నారు. అత్యంత పారదర్శకంగా క్రమశిక్షణతో ఎలాంటి విభేదాలు లేకుండా ఎన్నికలు నిర్వహించిన అడహాక్ కమిటీ సభ్యులను నూతనంగా ఎన్నికైన సభ్యులు ప్రశంసించారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దర్గా దయాకర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మునుకుంట్ల సహదేవ్ గౌడ్, దుబ్బాక వెంకటేష్ గౌడ్, బద్దం మల్లారెడ్డి, దేశగోని శ్రీనివాస్ గౌడ్, జైహింద్ గౌడ్, శ్రీను నాయక్, 5వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మునుకుంట్ల కిరణ్ గౌడ్, చిలుముల అంజిరెడ్డి, మర్రి అంజిరెడ్డి, సుదర్శన్ రెడ్డి, గూడెం సత్యనారాయణ, 3, 4, 5 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిలు బొడిగె ఉదయరాజు గౌడ్, యాసారం నగేష్, ముదిగొండ రమేష్, మర్రి జంగారెడ్డి, దుబ్బాక బిక్షపతి, యాసారం వెంకటేష్, మునికుంట్ల సునీల్, రాజీవ్, యాదగిరి, సందీప్, దుబ్బాక వినోద్, విక్రం, సందీప్, రవిచంద్ర, ఎర్ర నరసింహ, బొడిగె సాయి, బొడిగె రాజు, కాలనీ సభ్యులు గోవుల కృష్ణ, ప్రసాద్, నగేష్ గుప్తా, ఎస్. సుధాకర్, ఆర్. వేణు, ఎఫ్. రామకృష్ణ, ఎం వెంకటేష్, జలంధర్ రెడ్డి, రవీందర్, ప్రభాకర్, మన్నే. మహేష్, వివేక్ రెడ్డి, శేఖర్, సుధాకర్, రాజు, మురళి అచ్యుతారావు, కే. రాము, జె రాజేష్, ఇస్మాయిల్, ఎస్. పరమేష్, కాలేరు కృష్ణ, జగన్నాథ్ శర్మ, కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.





## యువ హీరో ప్లాన్ చేసిన రవితేజ బయోపిక్..

సినిమా రంగంలో గత కొన్నేళ్లుగా బయోపిక్‌లు ట్రెండ్‌గా మారాయి. ప్రముఖుల జీవిత కథలను తెరపై చూపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు దర్శకులు. 'మహానటి' సావిత్రి బయోపిక్‌తో దర్శకుడు నాగ్ అశ్విన్ బ్లాక్‌బస్టర్ హిట్ సాధించిన తర్వాత తెలుగులో పలు బయోపిక్‌లు వచ్చినా, అవి ఆ స్థాయిలో విజయం సాధించలేదు. అయితే ఈ టాపిక్ మళ్లీ చర్చల్లోకి రావడానికి కారణం యంగ్ హీరో సిద్ధు జొన్నలగడ్డ . తాజాగా తన సినిమా 'తెలుసు కదా' ప్రమోషన్స్‌లో భాగంగా సిద్ధు, మాస్ మహారాజ రవితేజ తో ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవితేజపై తన అభిమానాన్ని వ్యక్తం చేశారు. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా అసిస్టెంట్ డైరెక్టర్‌గా మొదలై, చిన్న పాత్రల నుంచి హీరోగా ఎదిగిన రవితేజ జర్నీ నాకు చాలా ఇన్‌స్పైరింగ్‌గా అనిపించింది. అందుకే ఆయన బయోపిక్ చేయాలని ఒకప్పుడు సీరియస్‌గా ప్లాన్ చేశాను అని సిద్ధు తెలిపారు. తన సినిమా 'కృష్ణ అండ్ హీజ్ లీలా' తర్వాత రవితేజ బయోపిక్ స్క్రిప్ట్‌పై కొంతకాలం పని చేశానని, కానీ కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్‌ను ఆపివేశానని చెప్పారు. సిద్ధు మాటలు విన్న రవితేజ కూడా బయోపిక్‌లపై తన అభిప్రాయాన్ని వెల్లడించారు. మన దగ్గర బయోపిక్‌లు ఎక్కువగా పాజిటివ్ కోణంలోనే చూపిస్తారు. కానీ ఒక మనిషి జీవితాన్ని నిజంగా చూపాలంటే, అతనిలోని నెగెటివ్ సైడ్‌ను కూడా చూపించాలి. అప్పుడు మాత్రమే అది రియల్‌గా అనిపిస్తుంది అని రవితేజ అన్నారు. అంతేకాక, తాను కూడా ఒక నటుడి బయోపిక్ తీసే ఆలోచనలో ఉన్నానని చెప్పినా, ఆ నటుడు ఎవరో మాత్రం రహస్యంగా ఉంచారు రవితేజ. ఇకపోతే ఈ ఇద్దరు నటుల తాజా సినిమాలు ఈ నెలలోనే థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. సిద్ధు జొన్నలగడ్డ నటించిన 'తెలుసు కదా' అక్టోబర్ 17న విడుదల కానుంది. నీరజ కోన దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటించారు. మరోవైపు రవితేజ నటించిన 'మాస్ జాతర' అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## అదే నిజమైతే అభిమానులకు పండగే..



నిప్పు లేనిదే పొగరాదంటారు. ఏదో కదలిక జరక్కపోతే ఏ వార్త అయినా ఇంతగా వ్యాప్తి చెందదు. పవన్‌కల్యాణ్ తాజా సినిమా విషయంలో ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో బలంగా వినిపిస్తూవుంది. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమా. దీనికి నిర్మాత దిల్‌రాజు.. అనేది ఈ వార్త సారాంశం. రీసెంట్‌గా 'ఓజీ' సంబరాల్లో పాల్గొన్న దిల్ రాజు.. నెక్ట్స్ పవన్‌కల్యాణ్‌తో సినిమా చేస్తానని, ఆయన రాజకీయాల్లో బిజీగా ఉన్నా.. రిక్వెస్ట్ చేసైనా డేట్స్ తీసుకుంటానని సభాముఖంగానే చెప్పారు. ఇప్పుడు వినిపిస్తున్న వార్తకు, అప్పుడు దిల్‌రాజు మాట్లాడిన మాటలు మరింత బలాన్నిచ్చాయి. ఇక తన కెరీర్‌లో ఎక్కువ సినిమాలు దిల్ రాజు సంస్థలోనే చేసిన అనిల్ రావిపూడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారని తెలుస్తున్నది. ఏ స్టార్‌కి తగ్గట్టుగా ఆ స్టార్‌కి కథను సెట్ చేసి సూపర్‌హిట్లు కొట్టడం అనిల్‌కు పెన్నుతో పెట్టిన విద్య. అందుకే పవన్‌తో తాను చేయబోతున్న సినిమాకు అనిల్‌ని దర్శకుడిగా దిల్ రాజు సెట్ చేశారట. మరి ఈ వార్తలో నిజం ఎంత ఉందో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాలి. ప్రస్తుతం చిరంజీవితో 'మన శంకరవరప్రసాద్‌గారు' సినిమా చేస్తున్నారు అనిల్ రావిపూడి . సంక్రాంతికి సినిమా విడుదల కానున్నది. పవన్ కూడా 'ఉస్తాద్ భగత్‌సింగ్'ని దాదాపుగా పూర్తి చేసేశారు.



## అందంతో ఆగం చేస్తుంది..

బాలీవుడ్ సామ్రాట్ మూవీతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ మొదటి సినిమాతోనే మంచి ఫేమ్ సంపాదించుకుంది. కానీ మూవీ మాత్రం హిట్ అందుకోలేకపోయింది. అయినా కూడా ఈ బ్యూటీకి వరసగా ఆఫర్స్ రావడం జరిగింది. వచ్చిన ప్రతి అవకాశాన్ని వదులు కూకుండా సినిమాలు చేసింది. కానీ ఒక్క సినిమా కూడా బ్లాక్ బస్టర్ హిట్ అందుకోలేదు. దీంతో మెల్లి మెల్లిగా ఈ బ్యూటీ గ్రాఫ్ పడిపోయిది. ఇక తెలుగులో వరుణ్ తేజ సరసన ఆపరేషన్ వాలెంటైన్ మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. కానీ ఈ మూవీ కూడా అంతగా హిట్ అవ్వకపోవడంతో ఈ అమ్మడు తెలుగు అభిమానుల మనసుదోచుకోలేకపోయింది. ఇక ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ పలు సినిమాల్లో నటిస్తూ, మంచి హిట్ కోసం ఎదురు చూస్తుంది. కానీ ఈ బ్యూటీకి ఆశించిన స్థాయిలో అవకాశాలు రావడం లేదని టాక్ఇ క ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటే ఈ బ్యూటీ, తన అంద చందాలతో అందరినీ ఆకట్టుకుంటుంది. తాజాగా గోల్డ్ కలర్ డ్రెస్‌లో తన అందంతో అందరినీ మాయ చేస్తోంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.



## విష్ణు అందాల సెగలు..

సుడిగాలి సుధీర్ సరసన పోవే పోరా షోతో మంచి పాపులారిటీ సంపాదించుకున్న ముద్దుగుమ్మ విష్ణు ప్రియ. ఈ బ్యూటీ గురించి ఎంత చెప్పినా తక్కువే. బుల్లితెరపై తన అందంతో అందరినీ మాయ చేసిన ఈ ముద్దుగుమ్మ తెలుగు బిగ్గెస్ట్ రియాల్టీ షో బిగ్ బాస్ సీజన్ 8లోకి వెళ్లి మరింత పాపులారిటీ సంపాదించుకుంది. యాంకర్ విష్ణు ప్రియ అందానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే, అంతలా తన బ్యూటీనెస్‌తో అందరినీ ఆకట్టుకుంటుంది. తన మాటతీరు, అల్లరితో అందరి మనసు దోచేస్తుంటుంది. యాంకర్‌గా తన కెరీర్ మొదలు పెట్టిన ఈ ముద్దుగుమ్మ, యూట్యూబ్‌లో డ్యాన్స్ చేసి మరింత పాపులారిటీ సంపాదించుకుంది. తర్వాత బిగ్ బాస్ హౌస్‌లోకి వెళ్లి పృథ్వీతో ప్రేమ అంటూ మరింత క్రేజ్ సొంతం చేసుకుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ తన హాట్ అంట్ క్యూట్ ఫొటోస్ షేర్ చేస్తూ , కుర్రకారుకు అందాల విందు ఇస్తుంది. ఈ క్రమంలోనే ఈ అమ్మడు తాజాగా తన ఇన్ స్టాలో పలు ఫోటోలు షేర్ చేసింది. అందులో విష్ణు చాలా హాట్ గా, కొంటె చూపు చూస్తూ.. చీర కట్టులో తన అందంతో ఆగం చేస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

## సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా' కు యూఏ సర్టిఫికేట్ అక్టోబర్ 17న గ్రాండ్ గా రిలీజ్



స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ యూనిక్ లవ్ స్టోరీ "తెలుసు కదా" ఈ దీపావళికి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.

అక్టోబర్ 17న విడుదల కాబోతున్న ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకొని 'U/A' సర్టిఫికేట్ పొందింది.

ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి. విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు.సెన్సార్ టాక్ ప్రకారం, చిత్రానికి ఫుల్ పాజిటివ్ రిపోర్ట్స్ రావండతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి.

సినిమా రన్‌టైమ్ 2 గంటల 16 నిమిషాలు, ఎలాంటి లాగింగ్ లేకుండా రేసీగా, ఎంటర్‌టైనింగ్‌గా వుంటుంది, సిద్ధు జొన్నలగడ్డ, శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా పాత్రలు యువతరానికి కనెక్ట్ అయ్యేలా ఈ ప్రేమకథ సాగనుంది.

కథలో ఊహించని మలుపులు, భావోద్వేగాలు ప్రేక్షకులు సరికొత్త అనుభూతిని పంచనున్నాయి. సిద్ధు తన స్వాగ్ చార్మ్ ఎనర్జీతో ఆకట్టుకోనున్నాడు. శ్రీనిధి, రాశీ గ్లామర్‌తో అలరించబోతున్నారు. వైవా హర్ష తన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను నవ్వించనున్నారు.

ఇప్పటికే ఎస్ థమన్ కంపోజ్ చేసిన రెండు పాటలు వైరల్ అవడంతో మ్యూజిక్ సినిమా మీద మరింత బజ్ క్రియేట్ చేసింది.

"తెలుసు కదా" ఈ దీపావళికి రొమాన్స్, ఫన్, ఫీల్, సోషల్ మెసేజ్ ఆల్ ఇన్ వన్ ప్యాకేజ్‌గా ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి సిద్ధంగా ఉంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**